
సాక్షి
కుమురంభీం

ఆదివారం : 17 : డిసెంబర్ : 2023

గెలుపు నిర్ణేత శ్రీరాంపూర్
సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ల గెలుపోటములను శ్రీరాంపూర్ ఏరియానే నిర్దేశించనుంది. అత్యధిక ఓట్లు ఇక్కడే ఉన్నాయి. 8లో▸



ప్రశాంతధామం.. చపరాడ ఆలయం
చపరాడ హనుమాన్ ఆలయం పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. భక్తులు అధికసంఖ్యలో వచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 /17.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. తెల్లవారు జామున మంచు కురుస్తుంది.

ప్రాజెక్టులు పూర్తయ్యేనా?

- తాగునీటికే 'కొమురంభీమ్' పరిమితం
- ఆరుతడి పంటలే వేస్తున్న అన్నదాతలు
- కాంగ్రెస్ పాలనలోనైనా తీరు మారేనా?
- ప్రాజెక్టులు పూర్తయి సాగునీరందేనా?
- ఆశగా నిరీక్షిస్తున్న ఆయకట్టు రైతులు


దెబ్బతినకుండా కొమురంభీమ్ ప్రాజెక్ట్ కట్టపై కప్పిన కవర్లు

ఆసిఫాబాద్: జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా పాలకుల నిర్లక్ష్యంతో రైతులకు సాగునీరందని దుస్థితి నెలకొంది. పాలకులెందరు మారుతున్నా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పనులు పూర్తి చేయడంలేదు. రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్‌పై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ పాలనలోనైనా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కావాలని ఆకాంక్షిస్తున్నారు. రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించగా.. ప్రాజెక్టులకు మహర్దశ రానుందని జిల్లాలోని రైతులు భావిస్తున్నారు. ప్రాజెక్టుల్లో నిండా నీరున్నా అవి పూర్తి కాకపోవడంతో సాగునీరందక రైతులు నేటికీ ఆరుతడి పంటలే సాగు చేస్తున్నారు.

తాగునీటికే పరిమితం!
ఆసిఫాబాద్ మండలంలో సుమారు రూ.600 కోట్లతో చేపట్టిన కొమురంభీమ్ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్ట్ నిర్మాణ పనులు ఏళ్లుగా పూర్తి కావడం లేదు. కాలువల నిర్మాణం పూర్తి కాని ఈ ప్రాజెక్ట్‌ను 2011లో నవంబర్ 19న ప్రారంభించారు. 10 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల ద్వారా 45,500 ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. కాగా, కాలువల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో వెయ్యి ఎకరాలకు కూడా సాగునీరందడం లేదు. కాలువల నిర్మాణానికి భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. జలాశయం పూర్తయినా కాలువల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. సాగునీటి కోసం నిర్మించిన ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం తాగునీటి ప్రాజెక్టుగానే మిగిలింది. అలాగే రూ.100 కోట్లతో నిర్మించిన వట్టివాగు ప్రాజెక్ట్ పరిస్థితి అధ్వానంగా మారింది. ఆసిఫాబాద్ మండలం పహడీ బండ వద్ద నిర్మించిన ఈ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువల ద్వారా 24,500 ఎకరాలకు సాగు నీరందాల్సి ఉండగా, ప్రస్తుతం సుమారు 2,500 ఎకరాలకు మాత్రమే సాగునీరందుతోంది. ఈ ప్రాజెక్ట్‌ను 1998లో ప్రారంభించగా, ఆయకట్టు రైతులు భూమిని అభివృద్ధి చేసుకున్నారు. తమ పంట పొలాలకు సాగునీరందుతుందనే ఆశతో భూములు చదును చేసుకుని సాగుకు సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో రెండుమూడేళ్ల నిరీక్షించిన రైతులు

ఆధునికీకరణకు నోచుకునేనా?


వాంకిడి వద్ద తుంగతో నిండిన కొమురంభీమ్ ప్రాజెక్ట్ కాలువ

జిల్లాలో జగన్నాథ్‌పూర్ ప్రాజెక్ట్, కొమురం భీమ్ ప్రాజెక్ట్, వట్టివాగు ప్రాజెక్ట్, పీపీరావు ప్రాజెక్ట్, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్ట్‌తో పాటు చెక్ డ్యామ్‌లున్నాయి. ఏళ్లుగా ఈ ప్రాజెక్టుల కాలువలు ఆధునికీకరణ, మరమ్మతుకు నోచుకోవడం లేదు. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులు 41,349 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉండగా, ఏటా 10వేల ఎకరాలకు మించి అందడంలేదు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఏటా అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నా పురోగతి లేదు.

చదును చేసిన భూముల్లోని ఒడ్లను దున్నేసి ఆరుతడి పంటలు సాగు చేసుకుంటున్నారు. కాలువల మరమ్మతు, ఆధునికీకరణకు నిధులు లేక సాగునీరందక రైతులకు నిరాశే మిగిలింది. పత్తి సాగు చేసిన రైతులు అకాల వర్షాలతో పంటనష్టపో

మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నాం

కుమురంభీమ్ ప్రాజెక్ట్ ఆనకట్ట దెబ్బతిన్న ప్రాంతంలో మట్టినమూనా పరీక్షల కోసం టెండర్లు పిలిచాం. ఇప్పటికే ప్రాజెక్ట్ వద్ద మొదటి మట్టి నమూనా పరీక్షలు నిర్వహించాం. సోమవారం రెండోసారి పరీక్షలు నిర్వహించి ల్యాబ్‌కు పంపిస్తాం. ఈ ప్రక్రియ పూర్తయితే మరమ్మతుకు అవసరమైన ప్రతిపాదనలు పంపిస్తాం.
– గుణవంత్‌రావు, ఇరిగేషన్ ఈఈ

యారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన కొమురం భీమ్ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు సాగునీరందడం లేదు. మిషన్‌భగీరథ నీరు సరఫరా చేసేందుకే ఈ ప్రాజెక్ట్ పరిమితమైంది.

ప్రమాదంలో 'కొమురంభీం'
జిల్లాలోని కొమురంభీం ప్రాజెక్ట్ ప్రమాదం అంచున ఉంది. రెండేళ్ల క్రితం వర్షాలకు ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు చేరింది. వరద ఉధృతికి ప్రాజెక్ట్ ఆనకట్ట కుడివైపు చివరలో 700 నుంచి 990 మీటర్ల మధ్య దెబ్బతింది. రాళ్లు, మట్టి కొట్టుకుపోయి బలహీనపడింది. నీటి తాకిడికి కుంగిపోయింది. ఆనకట్టను పటిష్టం చేసేందుకు అవసరమైన నిధులు లేక అప్పట్లో ఇంజినీరింగ్ అధికారులు దానిపై పాలిథిన్ కవర్లు కప్పించారు. హడావుడిగా సాంకేతిక నిపుణుల బృందాన్ని రప్పించి ఆనకట్ట పటిష్టత, మట్టి నాణ్యతపై పరీక్షలు నిర్వహించారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక ఆనకట్టకు పూర్తిస్థాయి మరమ్మతు చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు మరమ్మతు కోసం ఒక్క అడుగు ముందుకు పడలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ మరమ్మతు కోసం పైసా విడుదల చేయలేదు. ఫలితంగా కొన్నాళ్లుగా ప్రాజెక్ట్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

నత్తనడకన 'జగన్నాథ్‌పూర్'
కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగుపై నిర్మించిన జగన్నాథ్‌పూర్ ప్రాజెక్ట్ పనులు దశాబ్ద కాలంగా నత్తనడకన సాగుతున్నాయి. కాగజ్‌నగర్, దహెగాం మండలాల పరిధిలోని 15వేల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉండగా, భూ సేకరణ, ఇతర సమస్యలతో తీవ్ర జాప్యం ఏర్పడింది. దీంతో ఆయకట్టు రైతులకు చుక్క నీరందని దుస్థితి నెలకొంది. ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రాజెక్టుల నిర్మాణంపై మొక్కుబడిగా చర్చించడం మినహా ఫలితం కానరావడం లేదు. దీంతో ఆయకట్టు రైతులు సాగు నీరందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తయితే తమ పంట పొలాలు సస్యశ్యామలమవుతాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. అలాగే తిర్యాణి మండలంలోని ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్ట్, పీపీ రావు ప్రాజెక్ట్ కింది రైతులకు కూడా పూర్తిస్థాయిలో సాగునీరందని దుస్థితి నెలకొంది. పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి జిల్లాలోని అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

శోభాయాత్ర విజయవంతం


శోభాయాత్రలో భక్తులు, పదాధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: అయోధ్య రామమందిరం నుంచి పూజిత అక్షింతలు శనివారం పట్టణంలోని బాలాజీనగర్‌లోగల శ్రీత్రినేత్ర ఆలయానికి చేరుకున్నాయి. సందర్భంగా భజరంగ్ దళ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్షింతల ఆహ్వాన శోభాయాత్ర నిర్వహించగా, విజయవంతమైంది. స్థానిక త్రినేత్ర ఆలయంలో వేద పండితుడు సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభించారు. ఈ శోభాయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా సాగుతూ స్థానిక బాలభారతి హనుమాన్ మందిరం వరకు కొనసాగింది. భాజాభజంత్రీలతో శోభాయాత్ర ప్రారంభం కాగా మహిళలు మంగళహారులతో స్వాగతం పలికారు. హనుమాన్ ఆలయానికి చేరుకున్న పూజిత అక్షింతలకు ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, భజరంగ్ దళ్ పదాధికారులు శివగౌడ్, ఎల్ మురళితో పాటు భక్తులు పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో స్పీడ్ బ్రేకర్లు వేయాలి


సీపీఎం నాయకుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ప్రధాన చౌరస్తాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాలను నివారించాలని శనివారం సాయంత్రం సీపీఎం పట్టణ కార్యదర్శి ఆనంద్ ఆధ్వర్యంలో నాయకులు, ప్రజాసంఘాల నాయకులు స్థానిక లారీ చౌరస్తాలో రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్‌లు ఏర్పాటు చేయకపోవడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపైనే బైఠాయించగా, పట్టణ పోలీసులు ఆనంద్‌ను అదుపులో తీసుకుని వేరే చోటకు తరలించారు. సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేస్తే అధికారులు పరిష్కరిస్తారని ఎస్సై అంజయ్య సూచించారు.

న్యూస్‌రీల్

నేడు జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఆదివారం జిల్లాస్థాయి జూనియర్ నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, సెక్రటరీ బీ తిరుపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికకు వచ్చేవారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు కళాశాలలో కోచ్‌లు హరీశ్, ఏడుకొండలు, అర్చనకు మారికి రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9949300668 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి షష్టి బోనాలు

కాగజ్‌నగర్ రూరల్: ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో ఆదివారం నుంచి షష్టిబోనాలు ప్రారంభం కానుండగా, భక్తులు కొత్త బియ్యం, నైవేద్యాన్ని వండారు. స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. కాగజ్‌నగర్ మండలంతో పాటు ఆసిఫాబాద్, పెంచికల్‌పేట, సిర్పూర్ (టి), మంచిర్యాల, బెల్లంపల్లి తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ ఆలయానికి అధికసంఖ్యలో వచ్చి ఇక్కడ నైవేద్యాన్ని వండి స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ బోనాలు నాలుగు వారాల పాటు కొనసాగనున్నాయి. షష్టి బోనాల సందర్భంగా ఆలయ కమిటీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక


మారుతి


ఆసిఫాబాద్‌అర్బన్: ఈ నెల 15నుంచి 17వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలోని చైతన్య కళాశాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఆసిఫాబాద్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల విద్యార్థి జాడి మారుతి ఎంపికయ్యాడు. ఈనెల 13న మందమర్రి లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్‌స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మారుతిని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్, పీడీ శంకర్, పీఈటీ యాదగిరి, ఉమ్మడి ఆదిలాబాద్ స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబురావ్, హౌస్ మాస్టర్ మహేశ్‌చంద్ర తదితరులు అభినందించారు.

నేడు బీజేపీ ఉమ్మడి జిల్లా సమావేశం

- హాజరుకానున్న సునీల్‌బన్సల్

నిర్మల్: భారతీయ జనతాపార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్మల్ పట్టణంలోని బైంసారోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షతోపాటు రానున్న పార్లమెంట్ ఎన్నికల సమాయత్తంపై చర్చ ఉంటుందన్నారు. రాష్ట్ర సహ ఇన్‌చార్జి సునీల్‌బన్సల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యులు, నాలుగు జిల్లాల బాధ్యులు హాజరు కావాలని కోరారు.

సమస్యలు పరిష్కరిస్తాం


సమస్యలు తెలుసుకుంటున్న మఝర్ ఉన్నీసా

కెరమెరి: మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాగజ్‌నగర్ అదనపు లేబర్ అధికారి మఝర్ ఉన్నీసా పేర్కొన్నారు. శనివారం ధనోర వాటర్ ప్లాంట్‌పరిధిలో పని చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈఎస్సై, పీఎఫ్, బోనస్, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమ్మె కాలపు వేతనాలు ఇవ్వాలని కార్మికులు కోరారు. గతంలో వరంగల్‌లోని లేబర్ కమిషనర్ సునీతకు కార్మికులు వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే సమస్యలు తెలుసుకునేందుకు వచ్చానని ఉన్నీసా తెలిపారు. కార్మికులు షర్ఫొద్దీన్, మహబూబ్, మొండయ్య, వసంత్, రాజన్న, ప్రశాంత్, విజయ్, సాజన్ ఉన్నారు.

జెడ్పీ చైర్మన్ ఎంపిక రాజ్యాంగ విరుద్ధం


అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఏజెన్సీ ప్రాంతంలో ఎస్టీ (మహిళ)కు రిజర్వ్ చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ పదవికి జనరల్ కేటగిరీకి చెందిన జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావ్‌ను తాత్కాలిక చైర్మన్‌గా ఎంపిక చేయడం రాజ్యాంగ విరుద్ధమని టీపీసీసీ నాయకుడు అనిల్ కుమార్ కామ్రె పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ నియామకంపై శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్న కోవ లక్ష్మి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఎన్నికైనట్లు తెలిపారు. ఆదివాసీలకు దక్కిన రాజ్యాంగ హక్కులను ఆధిపత్య వర్గాలు తమ చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం అంతటా కొనసాగుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా తక్షణమే రాష్ట్ర ఎన్నికల సంఘం కుమురంభీం ఆసిఫాబాద్ జెడ్పీ చైర్మన్ పదవికి ఎన్నికలు నిర్వహించి మరో ఎస్టీ (మహిళ)ను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీమాన్, ప్రకాశ్, వినోద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర ద్వారా ప్రజలకు అవగాహన


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దీపక్ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి తుకారాం భట్, డీపీవో హుస్సేన్‌తో కలిసి జిల్లాలో ఈనెల 16నుంచి జనవరి 26వరకు నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార రథాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కల్యాణ్, అన్న యోజన, దీన్ దయాల్ అంత్యోదయ యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవనజ్యోతి బీమా యోజన వంటి పథకాలపై గ్రామాల్లో ప్రజలకు అర్థమయ్యేలా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రచార యాత్రను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతీ గ్రామానికి ప్రచార రథం వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య, ఐకేపీ సభ్యులు పాల్గొన్నారు.

మానిక్‌పటార్‌లో పాఠశాల ఏర్పాటు


విద్యార్థులతో అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గుట్టపై రవాణా సౌకర్యం లేని మారుమూల మానిక్‌పటార్ గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. శనివారం ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబుతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మానిక్‌పటార్ గ్రామంలో నూతన పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లు, ఎడ్లబండి ద్వారా సామగ్రిని గ్రామస్తుల సహకారంతో గ్రామానికి తరలించి పాఠశాలకు పక్కా భవనం నిర్మించినట్లు తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవోను గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ భరత్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ'హితం' ఎప్పుడో!

- ప్రాజెక్ట్‌పై అసెంబ్లీలో ప్రస్తావన
- సీఎంల నోట ప్రాజెక్ట్ మాట
- జిల్లా ప్రజల్లో పెరిగిన ఆశలు
- ప్రాజెక్ట్‌తో అభివృద్ధికి అవకాశం


తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత నది

చింతలమానెపల్లి: 2008 డిసెంబర్ 16.. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్‌కు కౌటాల మండలం తుమ్మిడిహేటి వద్ద శంకుస్థాపన జరిగిన రోజు. 'ప్రాణహిత నదిపై ప్రాజెక్ట్ నాకల' అని చెప్పిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రాజెక్ట్ నిర్మాణానికి అంకురార్పణ జరిగిన రోజు. 2023 డిసెంబర్ 16న అసెంబ్లీలో ప్రస్తుత తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రాణహిత నదిపై తుమ్మిడిహేటి వద్ద ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించారు. అసెంబ్లీలో తుమ్మిడిహేటి ప్రాజెక్ట్ గురించి ఆయన మాట్లాడిన తీరు ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న వారిలో ఆశలు రేకెత్తిస్తోంది. నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల నుంచి తెలంగాణ ముఖ్యమంత్రులు ప్రాణహిత ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించడం ప్రాణహిత నదిపై ప్రాజెక్ట్ ప్రాధాన్యత, ప్రాముఖ్యతను తెలియజేస్తోంది.

తుమ్మిడిహేటి వద్ద 'ప్రాణహిత'..

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన జలయజ్ఞంలో భాగంగా ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు నీరందించడమే లక్ష్యంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాజెక్టుకు కుమురం భీం జిల్లాలోని కౌటాల మండలం తుమ్మిడిహేటి వద్ద 2008 డిసెంబర్ 16న శంకుస్థాపన చేశారు. రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో తెలంగాణలోని ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో 16.40 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. అప్పటి అంచనా ప్రకారం 97 మండలాలు, 1,742 గ్రామాలకు ఈ ప్రాజెక్ట్ నీరందేలా విస్తరించి ఉంది. తొలి విడతలో రూ.200 కోట్లు, 2011 బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించారు. ప్రాజెక్ట్ పనులను 28 ప్యాకేజీలుగా విభజించగా ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోతున్న ఆయా మండలాల రైతులకు ఎకరాకు రూ.1.27 లక్షల చొప్పున ప్రభుత్వం చెల్లించింది.

ప్రాజెక్ట్ ఆవశ్యకత

కుమురంభీం జిల్లాలో జల వనరులున్నా సాగుకు పూర్తి స్థాయిలో నీరందని స్థితి ఉంది. ప్రాణహిత నది పరీవాహక జిల్లాలైన కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో సాగు భూములకు ప్రాజెక్ట్ నిర్మాణంతో సాగు నీరందించే అవకాశం ఉంది. ప్రాజెక్ట్‌లో ఈ ప్రాంతానికి నీటిని కేటాయిస్తే సాగు, తాగునీటి అవసరాలను పూర్తిగా తీర్చవచ్చు. ప్రాజెక్ట్ నిర్మాణంతో స్థానికంగా పర్యాటకంగా అభివృద్ధికి అవకాశం ఉంది. ప్రజల ఆర్థిక పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వస్తాయని స్థానికులు భావిస్తున్నారు. కాళేశ్వరం వద్ద మేడిగడ్డ ప్రాజెక్ట్‌కు పగుళ్లు వచ్చిన సందర్భంలో ఇంజినీరింగ్ అధికారులు మాట్లాడుతూ.. ప్రాజెక్ట్‌కు వరద ఉధృతి అధికంగా ఉందని తెలియజేశారు. తుమ్మిడిహేటి వద్ద ప్రాణహిత నిర్మాణంతో మేడిగడ్డపై వరద ఉధృతి ప్రభావం తగ్గడంతో పాటు మేడిగడ్డ ప్రాజెక్టుతో వరద ముంపునకు గురవుతున్న ప్రాంతాలకు వరద ముప్పు తగ్గించే అవకాశం ఉంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహేటి వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్ట్‌కు అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్న ప్రస్తుత తరుణంలో కొత్త ప్రభుత్వం ప్రాజెక్టుకు అనుకూలంగా మాట్లాడుతుండగా స్థానికులు ప్రాజెక్టు నిర్మాణంపై ఆశలు పెట్టుకుంటున్నారు.

ప్రముఖుల నోట ప్రాజెక్ట్ మాట


పూజలు చేస్తున్న రేవంత్‌రెడ్డి (ఫైల్)

అపార జలవనరులున్న ప్రాణహిత నది ప్రాముఖ్యత, ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మించాల్సిన ఆవశ్యకతను రాష్ట్ర ప్రముఖులు గుర్తించారు. ఈ నేపథ్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాణహిత నదిపై ప్రాజెక్ట్ తన కల అని తెలిపారు. దివంగత కాంగ్రెస్ జాతీయ నాయకుడు గడ్డం వెంకటస్వామి 2008లో తుమ్మిడిహేటి వద్ద మాట్లాడుతూ.. ప్రాణహిత నదిపై ప్రాజెక్ట్ నిర్మించడం తెలివైన పని అని.. ఇది వైస్సార్‌తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఇక్కడ పర్యటించిన రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల బృందం ప్రాణహితపై తుమ్మిడిహేటి వద్ద ప్రాజెక్ట్ నిర్మాణం చేపడతామని తెలిపారు. ప్రస్తుత సిర్పూర్(టీ) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌రావు తుమ్మిడిహేటి వద్దకు పాదయాత్ర నిర్వహించారు. గవర్నర్ ప్రసంగంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కూడా ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మాణంపై స్పందించారు. ప్రాజెక్ట్ నిర్మాణంపై ఆమె మాట్లాడుతూ.. ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగు నీరందిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రీడిజైనింగ్ పేరిట కాళేశ్వరానికి తరలిపోయింది. ఎన్నికలకు ముందు ఈపార్టీ కూడా ప్రాజెక్టులో మార్పు చేస్తూ వార్ధా నదిపై రిజర్వాయర్ నిర్మించనున్నట్లు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో శ్రీకారం చుట్టిన ప్రాణహిత ప్రాజెక్ట్ ఆయన మరణానంతరం 2023వరకు మరుగున పడిపోగా తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ఆశలు కలిగిస్తోంది.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం



మడావి ఇస్రు

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి గోండుగూడకు చెందిన మడావి ఇస్రు కొన్ని రోజులుగా అదృశ్యమైనట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. అక్టోబర్ 10న ఇంట్లో నుంచి కూలీ పని కోసం వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. కుటుంబీకులు బంధువుల ఇళ్లు, ఇతర పట్టణాల్లో పరిశీలించిన అనంతరం శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే ఫోన్‌నంబరు 8712656547కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రేపు వాహనాల బహిరంగ వేలం

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ నెల 18న వాహనాల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ పరిధిలో నిర్వహించిన ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడిన 12 ద్విచక్రవాహనాలకు ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు వాహన విలువలో 50 శాతం ఈఎండీ చెల్లించాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

60వ సారి ఉపాధ్యాయుడి రక్తదానం



రక్తదానం చేస్తున్న బాబ్జీ

కాసిపేట: ఎన్నో మార్లు రక్తదానం చేయడంతోపాటు రక్తదానం చేయిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు ఈ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. మండలంలోని ట్యాంక్‌బస్తీకి చెందిన చొప్పదండి బాబ్జీ నెన్నెల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. శనివారం 60వ సారి మంచిర్యాలలోని వాలంటరీ బ్లడ్‌బ్యాంక్‌లో స్వచ్ఛందంగా రక్తదానం చేశాడు. బ్లడ్‌బ్యాంకు నిర్వాహకులు శాలువాతో సత్కరించారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈనెల 30న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. కోర్టు ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించినందుకు జిల్లాలో ప్రథమస్థానం లభించిందన్నారు. అనంతరం జడ్జి, సీనియర్ న్యాయవాది శ్రీధర్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ పాల్గొన్నారు.

18న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ పోటీలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 18వ తేదీన జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్ శనివారం తెలిపారు. అండర్–20, 18, 16 బాలబాలికలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఎంపికైనవారు 23న కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

గెలుపు నిర్ణేత శ్రీరాంపూర్

- శ్రీరాంపూర్ ఓట్లే కీలకం
- 25 శాతం ఓటర్లు ఇక్కడే
- మిగతా ఓట్లు 10 ఏరియాల్లో
- ఇక్కడ లీడ్ వస్తేనే సింగరేణి కైవసం

సింగరేణి ఓటర్ల వివరాలు..

ఏరియా	ఓటర్లు
బెల్లంపల్లి	985
మందమర్రి	4876
శ్రీరాంపూర్	9124
కార్పొరేట్	1192
కొత్తగూడెం	2370
మణుగూరు	2414
ఎల్లందు	603
నైనీ	2
భూపాలపల్లి	5350
ఆర్జీ 1	5430
ఆర్జీ 2	3479
అడ్రియాల	944
ఆర్జీ 3	3063
మొత్తం	39748



శ్రీరాంపూర్ డివిజన్ ముఖ ద్వారం

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ల గెలుపోటములను శ్రీరాంపూర్ ఏరియానే నిర్దేశించనుంది. ఈ ఏరియాలో ఉన్న అధిక శాతం ఓటర్లపైనే యూనియన్ల భవితవ్యం ఆధారపడి ఉంది. ఇక్కడ అధిక ఓట్లను కైవసం చేసుకుంటేనే సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిచే అవకాశం ఉంటుంది. దీంతో ప్రధాన కార్మిక సంఘాలన్నీ శ్రీరాంపూర్‌నే ప్రధాన కేంద్రంగా చేసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. కంపెనీ వ్యాప్తంగా 11 ఏరియాలతోపాటు నైనీబ్లాక్, అడ్రియాల ప్రాజెక్టులు కలిపి మొత్తం 39,748 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఒక్క శ్రీరాంపూర్‌లోనే 9,124 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఓట్లలో మెజారిటీ ఓట్లు తమ వైపునకు మళ్లించుకుంటే మిగతా ఏరియాల్లో హెచ్చుతగ్గులున్నా గెలుపు మాత్రం ఖాయంగా ఉంటుంది. గత 6వ దఫా గుర్తింపు సంఘం ఎన్నికల్లో శ్రీరాంపూర్‌లోనే టీబీజీకేఎస్ 2,243 ఓట్ల మెజార్టీని ఇక్కడ సొంతం చేసుకోవడంతోనే సింగరేణిలో విజయవకేతనం ఎగురవేసింది. నాటి ఎన్నికల్లో టీబీజీకేఎస్‌కు 6,189 ఓట్లు, ఏఐటీయూసీకి 3,946 ఓట్లు వచ్చాయి.

ఇక్కడే మకాం వేసిన నేతలు..

ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీఏఎస్, హెచ్ఎమ్మెస్, బీఎంఎస్, సీఐటీయూతోపాటు విప్లవ కార్మిక సంఘాల కూటమి సైతం ఇక్కడి ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య కొంతకాలంగా ఇక్కడే తిష్టవేసి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. శ్రీరాంపూర్‌లో వీలైనన్ని ఎక్కువ ఓట్లు రాబట్టుకోవాలనే ఉద్దేశ్యంతో క్యాడర్‌ను సమీకరించడం చేస్తున్నారు. ఆయన నిత్యం ఏదో ఒక గనిపై ప్రచారం చేసే మిగతా షిఫ్ట్‌లో ఇతర ఏరియాలకు వెళ్తున్నారు. ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ కూడా స్థానికంగా రసూల్‌పల్లెలో నివాసం ఉండడంతో ఆయన నిత్యం స్థానిక నేతలు, కార్మికులను కలుస్తూ ఈ ఏరియాలోనే వ్యవహారాలు చక్కబెడుతున్నారు. ఇతర సంఘాల నుంచి తమ సంఘంలో చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఇక బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డిలు కూడా శ్రీరాంపూర్ గనులను చుట్టి వస్తున్నారు. హెచ్ఎమ్మెస్ డివిజన్ నేతలు కూడా తమ తమ రీతిలో ప్రచారం చేస్తున్నారు. ఇక ప్రస్తుత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌లో మాత్రం అనిశ్చిత నెలకొంది. ఎన్నికలపై నాయకత్వం నుంచి సరైన దిశానిర్దేశం లేకపోవడంతో గత నాలుగు రోజులుగా గనులపై ప్రచారాలు కూడా నిలిచిపోయాయి.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



టగ్ ఆఫ్ వార్ పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

శ్రీరాంపూర్: సింగరేణి డేను పురస్కరించుకుని శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. జీఎం కార్యాలయం ముందున్న సెంట్రల్ నర్సరీలో పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించిన పోటీలను ఏరియా ఇంచార్జీ జీఎం రఘుకుమార్ ప్రారంభించారు. వాలీబాల్, త్రోబాల్ తదితర పోటీల్లో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. విజేతలకు ప్రగతి మైదానంలో జరిగే వేడుకల్లో బహుమతి ప్రదానం చేయనున్నారు. ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందర్‌రావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఏజెంట్ ఏవీ రెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి ఉన్నారు.

‘కొత్త బావులు తెస్తాం’



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో గెలిస్తే కొత్త భూగర్భగనులు తీసుకొస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. శనివారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులతో మాట్లాడారు. సింగరేణిలో కొత్తగనులు రాక ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని తెలిపారు. కార్మికులకు మెరుగైన వైద్యం, బస్తీలో దవఖానాల సౌకర్యం, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. కంపెనీ వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాజుయాదవ్, రమేష్, కొంపల్లి తిరుపతి, దొంతుల రాజేంద్రప్రసాద్, మోతే ఓదెలు, ప్రభాకర్ ఆనందరావు పాల్గొన్నారు.

‘అవకాశమిస్తే హక్కులు సాధిస్తాం’



మాట్లాడుతున్న నాగరాజ్ గోపాల్

శ్రీరాంపూర్: సింగరేణిలో అవకాశం ఇచ్చి గెలిపిస్తే హక్కులు సాధిస్తామని సీఐటీయూ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ తెలిపారు. శనివారం ఎస్ఆర్పీ 3,3ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా సింగరేణిలోని సంఘాల నేతలు ప్రభుత్వ సంఘాల్లో చేరుతున్నారని అన్నారు. ఇప్పటివరకు గెలిచిన సంఘాలు చేసిన కొన్ని ఒప్పందాలు వన్‌టైం సెటిల్మెంట్ కింద చేశారని, దీని వల్ల కార్మికులు తరచూ ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. పక్కనే గోదావరి ఉన్నా కార్మిక కుటుంబాలకు పరిశుభ్రమైన నీటిని ఇప్పించలేని గుర్తింపు సంఘాలను ఓడించాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ డివిజన్ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు చీకట్ల సాగర్, అజయ్ సాయి, శ్రీనివాస్, సదానందం, ఇప్ప నరేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై యాత్ర



ప్రచార రథం వద్ద మనోజ్ శత్రి

మంచిర్యాలఅగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారత వికసిత్ సంకల్ప్ యాత్ర నిర్వహిస్తున్నట్లు మినిస్ట్రీ ఆఫ్ కెమికల్స్, ఫెర్టిలైజర్స్ జాయింట్ సెక్రెటరీ మనోజ్ శత్రి తెలిపారు. శనివారం జిల్లాలో సంకల్ప్ యాత్ర ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రలో భాగంగా జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం, హాజీపూర్ మండలం వేంపల్లి, భీమారం మండలం పోలంపల్లి, మందమర్రి మండలం బొక్కలగుట్టలలో కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. ఇదే తరహాలో జిల్లాలోని 311 గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఆయుష్మాన్ భారత్, గరీబ్ కల్యాణ్, అన్నయోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన, నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, విశ్వకర్మ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, జీవన్‌జ్యోతి బీమా, సురక్ష బీమా తదితర పథకాలపై ప్రచారం నిర్వహిస్తామని, వచ్చే జనవరి 26న గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు పూర్తి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరావు, జెడ్పీ సీఈవో నరేందర్, కృషి విజ్ఞాన్ కేంద్ర సమన్వయకర్త తదితరులు పాల్గొన్నారు.

రాణా ఎదుట శేజల్ నిరసన

తాండూర్: స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట ఆరిజిన్ డైయిరీ సీఏవో బోడపాటి శేజల్ శనివారం నిరసన వ్యక్తం చేసింది. గతేడాది తాండూర్ పోలీసులు తనపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించింది. తాండూర్ మండలానికి చెందిన రంగారావు, సతీష్‌రావు, హరిప్రియ, కుమ్మరి పోషం, చిల్లర సంతోష్ తమపై తప్పుడు ఫిర్యాదు చేశారని పేర్కొంది. పోలీసులు ఏకపక్ష విచారణతో కేసుల్లో ఇరికించారని ఆరోపించింది. డెయిరీ నిర్వహణలో భాగంగా రైతులకు రూ.10 లక్షల విలువైన ఎనిమిది ఆవులు, రెండు గేదెలు ఇచ్చినట్లు తెలిపింది. తాజాగా తన ఫిర్యాదు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపింది. కాగా, ఈవిషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా.. శేజల్ ఫిర్యాదు మేరకు ఏడాది క్రితం కేసు నమోదు చేశామని, మళ్లీ అదే సమస్యపై రెండోసారి ఫిర్యాదు చేయడానికి వచ్చారని పేర్కొన్నారు. ఒకే అంశంపై రెండు ఫిర్యాదులు చేస్తే కేసు నమోదు చేయడం కుదరని తెలిపారు.

చదరంగంలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు చదరంగం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ లలితాకుమారి తెలిపారు. ఈ నెల 15న బెల్లంపల్లిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి పోటీలో విద్యార్థులు శ్రీహర్షిణి, మల్లేశ్వరి, రాజహంస ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

18న కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 17 బాలబాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 18న నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జట్ల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు మైదానానికి చేరుకుని పీఈటీ సదానందంకు రిపోర్టు చేయాలని సూచించారు.

‘ప్రైవేటీకరణను అడ్డుకుంటాం’



మాట్లాడుతున్న కాంపెల్లి సమ్మయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో ఐఎన్టీయూసీని గెలిస్తే ప్రైవేటీకరణ అడ్డుకుంటామని యూనియన్ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య తెలిపారు. శనివారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5, ఆర్కే 6, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనులపై యూనియన్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓసీపీలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సింగరేణి గనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని చూస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ బీజేపీ ప్రభుత్వంతో కుమ్మక్కు కావడం వల్ల ఇప్పటికే కొన్ని గనులు ప్రైవేటు సంస్థల పరం అయ్యాయని తెలిపారు. ఆయా గనులపై పలువురు కార్మికులు, ఇతర సంఘాల చెందినవారు యూనియన్‌లో చేరారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని శ్యామ్, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, జాతీయ సమితి సభ్యులు భీంరావు, కేంద్ర కార్యదర్శులు లాగల శ్రీనివాస్, సమ్ము రాజయ్య, మైనింగ్ స్టాఫ్ నాయకులు తిరుపతి రాజు, నాయకులు భీంరవి, రామచందర్, శీలం చిన్నయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు మంచి భవిష్యత్



మాట్లాడుతున్న ఏరియా జీఎం మనోహర్

మందమర్రిరూరల్: విద్యార్థి దశ నుంచే ఆటల్లో ప్రావీణ్యం సంపాదించే క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అన్నారు. శనివారం మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ పోటీలను సీఐ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మనోహర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ యుగంలో చదువుతోపాటు ఆటలపై ఆసక్తి చూపే విద్యార్థులను అభినందించాలని అన్నారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారు మంచి ప్రతిభ కనబర్చాలని తెలిపారు. సింగరేణి సామాజిక బాధ్యతతో పరిసర ప్రాంత ప్రజలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి 21 జట్లు పాల్గొనగా.. విజేతకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు ఉంటుందని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా పీఎం శ్యాంసుందర్, కోచ్‌లు అరవింద్, రాజలింగు, శేఖర్, గౌరమ్మ, సభ్యులు ఆర్.వెంకటేశ్వర్లు, సంజయ్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘అలవెన్స్‌లపై ఆదాయ పన్ను మాఫీ’



ఏఐటీయూసీలో చేరిన వర్క్‌షాప్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: తాము గుర్తింపు సంఘం గెలిస్తే అలవెన్స్‌లపై ఆదాయ పన్ను మాఫీ చేయిస్తామని, యజమాన్యం చెల్లించే విధంగా ఒప్పందం చేస్తామని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి వీ.వీరభద్రయ్య, బ్రాంచీ కార్యదర్శి ఎస్కెబాజీసైదా తెలిపారు. శనివారం శ్రీరాంపూర్ సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్‌లలో యూనియన్ ఆధ్వర్యంలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోలిండియాలో అమలవుతున్నా సింగరేణిలో అమలుకు కాకపోవడానికి గత గుర్తింపు సంఘం వైఫల్యమేనని అన్నారు. వర్క్‌షాప్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు మహిళా కార్మికులు, కార్మికులు యూనియన్‌లో చేరారు. వేర్వేరుగా జరిగిన ఈ సమావేశాల్లో యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, నాయకులు రాచర్ల చంద్రమోహన్, ఎస్.మల్లేష్, మారుపాక సారయ్య, అఫ్రోజ్‌ఖాన్, రామచందర్, సదానందం, మురళీచౌదరి, గునిగంటి నరసింగరావు, మోహన్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

ఆర్నెల్లు నదీవాసమే!

- వలన బాటలో గంగపుత్రులు
- శ్రమకు తగిన ఫలితం దక్కడంలేదని ఆవేదన



ప్రాణహిత నదిలో నిర్మించుకున్న గుడారాలు



ఎడ్లబండిలో పడవను తీసుకెళ్తున్న జాలర్లు

వేమనపల్లి(బెల్లంపల్లి): మండల కేంద్రంతో పాటు కల్మలపేటకు చెందిన గంగపుత్రులు సుమారు 240 కుటుంబాలు ఇల్లు, వాకిలి వదిలి చేపల వేటకు వలసబాట పడుతున్నారు. కొందరు ప్రాణహిత నదికి, మరికొందరు గోదావరినదికి వెళ్తున్నారు. డిసెంబర్‌లో వెళ్లి మే మాసం చివరి వరకు అక్కడే ఉంటారు. మడుగుల వద్ద వేసుకున్న గుడారాలే వారికి ఆవాసాలు. ఇసుక తిన్నెలే పడకపాన్పులు. రాత్రంతా చల్లని గాలులు, పగలంతా ఎండవేడిమికి తట్టుకుంటూ నదిలోనే ఉండిపోతారు. రాత్రి, పగలు తేడా లేకుండా చేపల వేట సాగిస్తారు. ఇప్పటికే ఎడ్లబండ్లు , ప్రైవేట్ వాహనాల్లో పడవలు, వలలు వంట సామగ్రి తరలించారు.

చిక్కని చేపలు

మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రాణహిత, సింగిరేవుబండ, పాయిరాల మడుగుల వద్ద రేగుంట, రాచర్ల మడుగులు, కళ్లెంపల్లి, కర్జెల్లి మడుగుల వద్ద, దూర ప్రాంతమైన గోదావరినది, సోమన్‌పల్లి, ఎల్మడుగు, గోదావరిఖని, గొల్లవాగు ప్రాజెక్టుల వద్ద నివాసం ఉంటున్నారు. భారీ వర్షాల కారణంగా మడుగులు అంతర్ధానమయ్యాయి. నదిలో నాచు, లబ్బగడ్డి ఎక్కువై వేసిన వలలు లాగడం ఇబ్బందిగా మారుతోంది. చేపలకు ఆవాసమైన మడుగులు లేక దిగువకు వెళ్లిపోయినట్లు జాలర్లు తెలుపుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడుతున్నా శ్రమకు తగిన ఫలితం లభించడం లేదని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యూమోనియా నివారణకు చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: చిన్నారుల్లో న్యూమోనియా లక్షణాలను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం వైద్యులు, సిబ్బందికి సాన్స్ క్యాంపెయిన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 29 వరకు జిల్లాలో సాన్స్ (సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ ప్లాన్ టు న్యూట్రలైజ్ న్యూమోనియా సక్సెస్‌ఫుల్లి) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన దగ్గు, వేగంగా శ్వాస తీసుకోవడం, జ్వరం న్యూమోనియా లక్షణాలని, నివారణలో భాగంగా చిన్నారులను వెచ్చని వస్త్రంతో కప్పి ఉంచాలన్నారు. ఇది సోకకుండా ఉండేందుకు చిన్నారులకు 3 డోసుల న్యూమోకాల్ వ్యాక్సిన్ ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణంలో మహిళలే అధికం



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికులే ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఈ నెల 9నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రాగా.. శుక్రవారం జీరో టికెట్ అమల్లోకి తెచ్చారు. డిపో పరిధిలోని 93 పల్లెవెలుగు, 22 ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ప్రయాణించగా జీరో టికెట్ జారీ చేశారు. మొత్తం 51వేలకు పైగా ప్రయాణించగా ఒక్కరోజులోనే మహిళలు 36,650 మంది ప్రయాణం చేశారు. ఈ లెక్కన పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ఉన్నారు. చెన్నూర్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ రూట్లలో ప్రయాణించే మహిళల సంఖ్య అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉచిత ప్రయాణానికి అనుమతించిన ఆర్టీసీ యాజమాన్యం శుక్రవారం నుంచి ఎంతమంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారో లెక్క తేల్చేందుకు జీరో టికెట్‌ను అమలు చేస్తోంది. ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. జీరో టికెట్ ఇస్తున్నందున ప్రయాణికులు తెలంగాణ ప్రాంతమా..? ఇతర ప్రాంతాలకు చెందిన వారా అనేది తెలుసుకునేందుకు గుర్తింపుకార్డు చూపించాలని మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు.